# ఏడాదికోరోజు పులి





నబీ సాయెబు పులివేషం చూసి తీరవల్సిందే. దసరావస్తే పిల్లల సంబరాలు వొకయెత్తు, నబీసాయెబు పులివేషం వొకయెత్తు.

దూరంగా డప్పులు.

టంకు టమా ..... టంకు టమా ......

ఈలలు ..... చప్పట్లు

ఈలలు, చప్పట్లు.

నబీసాయెబు పులివేషం బయలుదేరింది. ఇళ్ళలో జనం పన్లొదిలేసి వీధిలో కొచ్చారు. పిల్ల, పాప భయపడి భోషాణాల క్రింద దాక్కున్నారు. డప్పులు పేలిపోతున్నాయి. ఛిక్ చిక్ ఛిక్ .... ఛిక్ ఛిక్ చిక్ పులి వీధిలోకొచ్చింది. వీరావేశంతో గెంతుతోంది. ఓ చేతిలో యెముక మరో చేతిలో నిమ్మకాయ, డప్పులు ఫెళ ఫెళ మోగుతూంటే ఆట ఉధృతంగా సాగుతోంది. చూస్తున్నవాళ్ళకి నెత్తురు పొంగుతోంది. పులిబారలు బారలుగా వస్తోంది. చెంగు చెంగున గెంతుతోంది. పంజావిప్పి పైన పడుతోంది. ఎటు చూస్తే అటు గుంపు చెదిరిపోతోంది. పులికి భయపడి అందరూ దోవ యిస్తున్నారు.

నబీ సాయెబు జగదేక వీరుడిలా రొమ్ము విరుచుకు ముందుకు నడుస్తున్నాడు. జయ జయ ధ్వానాల్లాగా తప్పెట్లు మోగుతూంటే దేశాన్ని జయించి వచ్చిన చక్రవర్తిలాగా ఠీవిగా నడుస్తున్నాడు. ఇరుపక్కల మోగుతున్న డప్పులు, బారులు తీరిన జనం, ఈలలు చప్పట్లు కొడ్తూ డబ్బు లెగరేస్తుంటే అంత ఠీవితోటి ఆ డబ్బులందుకుని చెడ్డీలో దోపుకుంటున్నాడు. ఊరు ఊరంతా తన్నే చూస్తోంది. ఊరు ఊరంతా వీర విహారం చేస్తున్నాడు నబీ సాయెబు. అతని గుండెల్లో గొప్ప పొంగు! ఈ మనుషులందరికంటే తను గొప్పవాడినన్న భావం! డబ్బు, దస్కం, మేడలు మిద్దెలు వున్న వీళ్ళందరికంటే అతీతుణ్ణి అన్న చూపు! విసిరేస్తున్న డబ్బులు అందుకుంటున్నా, చక్రవర్తి సామంత రాజులర్పించిన కానుకలు అంగీకరిస్తున్నప్పటి హుందా! అలా సూర్యుడు నడినెత్తికొచ్చేదాకా నబీసాయెబు పులై, వీరుడై, గండర గండడై, విజయ విహారం చేస్తున్నాడు.

అనుకున్న ప్రకారం డప్పుల వాళ్ళకి డబ్బులిచ్చేసి వాకిట్లో అడుగుపెట్టేసరికి నబీసాయెబు స్వరూపం పూర్తిగా మారిపోయింది. బేలబేలగా చూస్తూ నడుం వంగిపోగా బిక్కు బిక్కుమంటూ అడుగులో అడుగేసుకుంటూ వచ్చాడు. భార్య అమీనాబీని చూస్తే చెడ్డ వొణుకు నబీసాయెబుకు.

“డబ్బులెన్ని దొరికాయి” ఉరిమినట్టడిగింది అమీనాబీ.

మాట నాలిక దాటి బయటకు రాలేదు నబీ సాయెబుకు. చిల్లరంతా పెళ్ళాం దోసిట్లో పోశాడు.

"దొడ్లో కెళ్ళి కిరసనాయిలు పెట్టి కడుక్కో" అంది అమీనాబీ.

పులి పిల్లిలా దొడ్లోకి జారుకుంది. పెళ్ళాం వొళ్ళు తోమలేదు. ఓ మంచి మాట మాట్లాడలేదు. కష్టపడ్డావని మెచ్చుకోలేదు. తన్ను తాను తిట్టుకున్నాడు. కుళ్ళి కుళ్ళి బాధపడ్డాడు. ఒక్క పెళ్ళామే కాదు, ఊళ్ళో తనని ఎవరూ మనిషిగా గుర్తించరు. కూలిపని కూడా ఇవ్వరు. వారానికో, నెలకో చాటింపు వేయడానికి, 'తాషా' కొట్టడానికి పిలుస్తారు. అంతకు మించి తనను మనిషిగా కూడా గుర్తించరు. అందుకే నబీసాయెబుకు జనమంటే కసి. కోపం.

దసరాలో ఈ ఒక్కరోజే ఇష్టం.

ఈ నాలుగు గంటలే ప్రాణం.

ఈ ఒక్కరోజు కోసం, ఈ నాలుగు గంటలకోసం తను సంవత్సరమంతా ఎదురు చూస్తాడు. ఈ నాలుగు గంటలు తను పులి. వీరాధి వీరుడు. మళ్ళీ సంవత్సరం తరువాతే తనకు బ్రతుకు. ఆ రోజు కోసం నిరీక్షణ.

ఊళ్ళో జనం కూడా నబీసాయెబు పులివేషం కోసం ఎదురుచూసేవారు. ఆ రాత్రి అన్నం తినేవాడు కాదు. తెల్లవారుఝామునే లేచి రంగులు పూసుకునేవాడు.వంగిపోయిన నడుం బాణంలా బిగిసేది. కళ్ళల్లోకి నెత్తురు తన్నుకొచ్చేది. శరీరం పెరిగిపోయేది. దేహం వీరావేశంతో వూగిపోయేది. ఊరు, వాడ విలయతాండవం చేసేవాడు. తాండవం పెరిగినకొద్దీ తప్పెట్ల మోతలు. ఈలలు హెచ్చేవి. పులివేషం అయిపోయిన తరువాత కూడా ఎన్ని రోజులు చెప్పుకునేవారో.

మర్నాడు మళ్ళీ మామూలు నబీసాయెబే. బిక్కు బిక్కుమంటూ బీడీలడుక్కునేవాడు. పెళ్ళాం చేత చివాట్లుతినేవాడు. గంజితాగి పడుకుని

రాత్రిళ్ళు పులివేషం గురించి సంవత్సరమంతా కలలు కనేవాడు.

నబీసాయెబు పెద్దవాడైపోయాడు. వెనకటిలా పులివేషం కట్టలేకపోతున్నాడు. కుర్రకారు వేషాలు కడ్తుంటే తను వేషం వేసుకోలేకపోయినా తప్పెట్ల కనువుగా తనూ చిందువేసేవాడు. కాని ఆ చిందులో చురుకులేదు. కళ్ళల్లో వేడిలేదు. అలిసిపోయి, ఊరేగింపు సగంలోనే ఆగిపోయి కుమిలిపోయేవాడు.

కొంతకాలానికి ఆపాటి కూడా వీధిలోకి రాలేక కుక్కిమంచంలోనే పడుకున్నాడు. మళ్ళీ దసరావచ్చింది. దూరంగా డప్పుల మోత. ఈలలు, చప్పట్లు ..... మంచంలో పడున్న నబీసాయెబు వొళ్ళు పొంగుతోంది.

టంకు టమ .... టంకు టమ .....

కాళ్ళూ, చేతులు లయగా వూపుతున్నాడు నబీసాయెబు.

ఛిక్ ఛిక్ ఛిక్ ........ ఛిక్ ఛిక్ ఛిక్

మంచంలోనే పులై పోతున్నాడు.

కళ్ళవెంట ధారలుగా కన్నీళ్ళు.

రోజూ తిట్టిపోసే అమీనాబీ చిక్కి శల్యమై, పులై పోవాలని తపనపడుతున్న మొగుడ్ని చూసింది. వున్నట్టుండి అమీనాబీకి దుఃఖం వచ్చింది. మొగుడి దగ్గరకొచ్చి ఆడిస్తున్న చేతుల్ని ఆప్యాయంగా పట్టుకుని "చాలయ్యా! ఆడినంతకాలం ఆడావు. నీ ఆట అయిపోయిందయ్యా, నీరస పడతావయ్యా" అంటూ ప్రేమగా చూసింది. నబీసాయెబు ఇది నిజమా కలా అని బిత్తరపోయి భార్యవైపు చూశాడు. భార్య కళ్ళల్లోకూడా కన్నీళ్ళు.

నబీసాయెబు భార్య కన్నీళ్ళు తుడుస్తూ అన్నాడు "ఇంత మంచిమాట జల్మలో ఎప్పుడూ అన్లేదు గదే. ఇంత సుకమైన మాట యెనకనుంటే ఏడాది కొక్క రోజేందే, జల్మంతా పులై పోయేవాడ్ని గదే." ❋